# అంతర్స్రోతం



'విశాలాంధ్ర' దినపత్రిక 'ఆదివారం అనుబంధం' . . . 25 డిసెంబర్' 2005

ఇది అనివార్యం అని తెలుసు...

మనిషికి సహజమైనది... తప్పనిది... తప్పించుకోలేనిది! అయినా మానవత్వాన్ని విరజిమ్మి బాధ్యతల్ని సవాళ్ళుగా తీసుకుని అనుక్షణం ఇతరుల కోసమే తానైన వ్యక్తి...

ఇంతలో ఇలా అవుతుందనుకోలేదు మహాలక్ష్మి.

దుఃఖం తన్నుకొస్తోంది. ఎక్కిళ్ళ మధ్య వెక్కివెక్కి ఏడుస్తోంది.

చుట్టూ చూసుకుంది మహాలక్ష్మి... తను తప్ప ఎవరూ లేరు. విషయం ఇంకా ఎవరికీ తెలిసినట్లు లేదు. మహాలక్ష్మి చేతిలో ఉన్న గోపాలం చేయి ఇంకా వెచ్చగానే ఉంది. ప్రాణం పోయి నాలుగైదు గంటలయింది.

దేహాంతమైనా తనను వీడనన్నట్టుంది. సమతుల్యత పాటించే రాజర్షిలా ముఖం చాలా నిశ్చలంగా... మహానిద్రలో... ప్రశాంతంగా..! అవును... తనకు గోపాలం ఎప్పుడూ రాజర్షే!

విగతజీవియై ఉన్న భర్త ముఖంలోకి చూసింది. ఆ పెదాలలో ఇంకా ఏదో చెప్పాలన్న తపన..! మహాలక్ష్మికి ఆయన పోయాడంటే ఒకపట్టాన నమ్మశక్యంగా లేదు. కానీ ఇది నిజం! పెద్దగా ఏమీ తీసుకోనూ లేదు. చివరిదాకా తన పనులు తాను చేసుకుంటూనే ఉన్నాడు. ప్రాణం విడిచే సమయంలో తన చేతిని పెనవేసుకున్న ఆ చేతిని విడదీసి అతని గుండెలపై ఉంచింది.

పెదాల మధ్య దుఃఖం ఆగడంలేదు. వెక్కివెక్కి ఏడుస్తూన్న ఆమె కళ్ళు ఎఱ్ఱబడి వున్నాయి. కన్నీరు అలుముకున్న మహాలక్ష్మి కంటికి ఆవల అంతా అంధకారంగా వుంది. భర్త ప్రక్కన ఒంటరిగా తను! పిల్లలు ప్రక్కన ఉండివుంటే తనకు కొంత ధైర్యంగా ఉండేది. తానున్న స్థితి చాలా భయానకంగా అన్పించింది మహాలక్ష్మికి.

“లక్ష్మమ్మా! ఎంత ఘోరం జరిగిపోయింది? ఏమిటో ఏడుపులు వినబడితే వచ్చాను!!” పక్కింటి పాపాయమ్మను చూసేసరికి శోకం తన్నుకొచ్చింది... ఎంత ఓదారుస్తున్నా ఆగడంలేదు.

సూరికి, సోముకి ఫోన్లు వెళ్లాయి. ‘వాళ్ళు వుండే ఊరు పెద్దదూరం కాదు. అయినా సడెన్‌గా రావాలంటే ఎలా! సెలవు పెట్టాలి, ట్రైన్ దొరకాలి, పెళ్ళాంపిల్లల్ని తీసుకురావాలి. ఎంతైనా సమయం పడుతుంది...’ తనని తాను సర్దిచెప్పుకొంది మహాలక్ష్మి. కన్నీటి తెరల మధ్య ఇన్నాళ్లూ సహజీవనం చేసిన వ్యక్తి తాలూకు జ్ఞాపకాలు ఒకదాని తరువాత మరొకటి ఎగిసి పడుతున్నాయి.

‘కనీసం మావుళ్ళయ్య అయినా రాలేదు. విషయం తెల్సిందో, లేదో..?!’

మావుళ్ళయ్య గోపాలానికి ప్రాణమిత్రుడు. గోపాలం చనిపోయాడన్న విషయం తెలిసి మావుళ్ళయ్య ఆఘమేఘాల మీద వచ్చాడు. పనిమీద పొరుగు ఊరు వెళ్లిన ఆయన ‘మహాలక్ష్మిని ఎలా ఓదార్చాలా...’ అనుకుంటూ మాటల్ని వల్లె వేసుకుంటున్నాడు.

శవమై పడివున్న గోపాలం... దగ్గర కూర్చొని వున్న మహాలక్ష్మి... చుట్టూ అలముకున్న నిశ్శబ్దం చూసి ఒకింత చకితుడయ్యాడు.

“లక్ష్మమ్మా..!” అనునయించబోయాడు.

శూన్యంలో వున్న ఆమెకు ఆ మాటలు విన్పించడం లేదు.

“పిల్లలకు కబురు వెళ్లిందా?!”

నిలువుగా ఊపిన ఆమె బుఱ్ఱే సమాధానమయింది.

గోపాలం మాష్టారి మంచితనాన్ని ఏకరువు పెడుతోంది పాపాయమ్మ. మధ్యలో తనూ చిన్నగా కంటనీరు పెడుతోంది. ప్రతిదానికీ మావుళ్ళయ్య 'ఊ...' కొడుతున్నాడు.

గోపాలం మాష్టారు కాలంచేశారన్న సంగతి ఊరంతా తెల్సిపోయింది!

జనం గుంపులుగా పోగయ్యారు. చిన్నతనంలో తమకు చదువు చెప్పిన మాష్టారు ఇకలేరంటే అందరికీ ఏదో వెలితిగా అన్పిస్తోంది. తమతో ఎంత కలివిడిగా ఉన్నదీ, ప్రతివారికీ ట్యూషన్లు చెప్పి జ్ఞానజ్యోతిని వెలిగించిందీ గుర్తుకుతెచ్చుకుంటున్నారు.

"మొన్నే రిటైరైన మాష్టారు ఇంకా బ్రతకాల్సింది... కానీ, ఆ కుక్కకాటు సెప్టిక్ కావటమే ఆయన ప్రాణాల మీదకు తెచ్చింది!" ఆ ఊరికి పెద్దమోతుబరి అనబడే మార్తయ్య చెప్పుకు పోతున్నాడు.

"ఈరోజుల్లో కుక్కకాటుకు చెప్పుదెబ్బ లాంటి మందులు దొరుకుతాయి. పట్నంలో డాక్టరు దగ్గరకు వెళ్ళి ట్రీట్‌మెంట్ చేయించుకుంటే ఇలా ప్రాణం మీదకు వచ్చేది కాదు!" ఎదురు వీధి యానాది అందుకున్నాడు.

"ట్రీట్‌మెంట్ చేయించుకోవడానికీ, డాక్టరు దగ్గర కెళ్ళడానికీ గోపాలంగారి జేబు బరువుగా ఉండాలి కదా! ఖద్దరు చొక్కా, పాత కళ్ళజోడు, చిరిగిన చేతిసంచీ తప్ప ఆయన ఏమీ సంపాదించు కోలేదు."

"మహాలక్ష్మమ్మను చూస్తే తెలియడంలా... బోసిమెడతో ఉంది పాపం! నగా, నట్రా చేయించాలన్న స్పృహ కూడా లేదాయనకు!" వెనుకవీధిలో ఉండే చలమయ్య భార్య కూడా వాళ్ళతో మాట కలిపింది.

"ఏం పెట్టి చేయిస్తాడేమిటీ..?! ఉన్నంతలో కొడుకులిద్దర్నీ చదివించి ప్రయోజకుల్ని చేశాడు. అదే ఎక్కువ ఆయనకు!" మరణించిన వ్యక్తిలోని మంచిని గురించి ఎవరిమటుకు వాళ్ళు చెప్పుకుపోతున్నారు.

"సోముకీ, సూరికీ కబురు వెళ్ళిందో.., లేదో..!" వాళ్ళతో కలిసి చదువుకున్న నాయుడుగారి అబ్బాయి అంటున్నాడు.

"ఫోన్ చేసే ఉంటుందావిడ!"

"మరోసారి చేద్దాం! మావుళ్ళయ్య మావని నంబర్ అడగండి!" జేబులోంచి సెల్‌ఫోన్ తీస్తూ అంటున్నాడు అతను.

మావుళ్ళయ్యకు నోటమాట కరువైపోయింది. ఇన్నేళ్లుగా తను గోపాలం సహచరుడు. స్కూలు టీచర్లుగా చాలా సంవత్సరాలు సహజీవనం చేశారిద్దరూ.

కష్టంలోనూ, ఆనందంలోనూ, ఉద్వేగంలోనూ ఎంతో చేదోడువాదోడుగా ఉండేవాళ్ళు. తనకు ఎప్పుడు ఏ ఉపకారం కావాలన్నా ముందుండేవాడు. తనకన్నా పెద్దవాడైనందున్న నాలుగేళ్ళ క్రితం రిటైరయ్యాడు. ఈ సంవత్సరం తాను రిటైర్ కాబోతున్నాడు.

"ఒరేయ్ఁ... మావుళ్ళూ! నువ్వు కూడా రిటైరైన తర్వాత మనిద్దరం ఈ ఊరిలోని పదిమందికీ ఉపయోగపడే ఏదైనా మంచిపని చెయ్యాలిరా!" అంటుండేవాడు.

"ఈరోజుల్లో ఏం చేయాలన్నా ప్రతిదీ డబ్బుతో కూడిన వ్యవహారం! మన పరిస్థితులు మనకు తెలియనివి కాదు."

"నా కొడుకులు ఇద్దరూ ప్రయోజకులయ్యారు. వాళ్ళు తమకు తాముగా బ్రతుకుతున్నారు. ఆ విధంగా నేను స్థితిమంతుణ్ణే! ఇక నువ్వంటావా... ఏం లోటు చెప్పు- చక్కని పిల్లలు, కుటుంబం!"

– ఆనాడు కార్తీక మాసాన పౌర్ణమి రోజున ఓంకార క్షేత్రాన్ని, ఓంకారేశ్వరుణ్ణి దర్శించుకొని సాయంత్రం పూట చక్కటి సముద్రపు గాలి అలలు మేనిని తాకుతుంటే... గుడికి ఎదురుగా రోడ్డుకు అవతల తిరుమలరావు పార్కులో కూర్చొని అంటూన్న గోపాలం మాటలు గుర్తుకొచ్చి గుండె బాధతో బరువెక్కింది మావుళ్ళయ్యకి.

అవును... ముమ్మాటికీ ఆ లోటు పూడ్చలేనిది! ఇక మహాలక్ష్మమ్మకయితే భర్త ఉన్నంతకాలం ఏమీ అన్పించలేదు. ప్రైవేటు స్కూలుటీచరు అయినా- రిటైరయిన తర్వాత ఫించను లాంటి సదుపాయాలు ఏమీ లేకపోయినా జీవితాన్ని ఉన్నంతలో బాగానే నెట్టుకొచ్చాడు.

మీరావలి షామియానా, కుర్చీలు తెచ్చివేశాడు. "అమ్మగారి దగ్గర డబ్బులేమీ ఉన్నట్లు లేదు. కావాలంటే చెప్పండి... సర్దుతాను!" ఊరి ప్రెసిడెంట్ వచ్చి దండవేసి ఓ హామీ పడేసి వెళ్లిపోయాడు.

పాపాయమ్మ అక్కడ చేరిన పదిమందికి కాఫీ ఏర్పాట్లు చూస్తోంది.

'పిల్లలు వచ్చేదాకయినా అద్దెకొంపలో ఉంచుతారో, లేదో..?!' అన్న భయం పట్టుకుంది మహాలక్ష్మికి. అదృష్టంకొద్దీ ఇంటి యజమాని ఇక్కడ ఉండటంలేదు. లేకపోతే బయటకు నెట్టేసేవాడే ఈపాటికి! – అదే అడిగింది మావుళ్ళయ్యని.

"అన్నీ నే చూస్తాగా... ఇప్పుడవేమీ పట్టించుకోకమ్మా!"

●

"అసలు... కుక్కల చేత, పందుల చేత ఎవరు కరిపించుకోమన్నారు? ప్రాణాలు ఎవరు తీసుకోమన్నారు? మమ్మల్ని చంపడం కాకపోతేను!" విరుచుకుపడుతున్నాడు సూరి.

సులోచనకు భర్త మాటలు వింతగానూ, చిత్రంగానూ ఉన్నాయి. ఆలోచిస్తే అతని ధోరణి సహేతుకంగానే ఉంది.

"సరేఁ... ముసలాయనకు కాలం తీరిపోయింది! మనసులో లేకపోయినా పదిమంది కోసమైనా వెళ్లక తప్పదు!" సన్నాయి నొక్కులతో అంటోంది.

"వెళ్లాలంటే మాటలా..?! ఈరోజు ఆఫీసులో ఆడిట్ నాకు. 'తండ్రులు పోయారు, తల్లులు ముండ మోశారు' అంటే పైఅధికారులకి ఏమీ పట్టదు. ఏదోఁ... పోయాడు- అయిపోయింది. నింపాదిగా వెళ్లి ఆమెను పలకరించి వస్తే సరిపోతుంది."

"బంటీగాడికి పరీక్షలు పట్టుమని రెండునెలలు కూడా లేవు. నేను మటుకు వాణ్ణి తీసుకుని ఎలాగ వెళ్లేది?!" వంతపాడుతోంది సులోచన.

"వయసయి వెళ్లిపోయాడు. అయినా... కని పారేశాడు కాని, ఏం సంపాదించి పారేశాడు కనుక? ఎప్పుడూ అర్థంకాని రాతలతో ఓఁ... కార్డు ముక్కలు రాసిపారెయ్యడం తప్ప!"

"కార్డు వచ్చినపుడల్లా ఏమైనా డబ్బు సర్దమని రాస్తాడేమోనని హడలి చచ్చేవాడిననుకో!" మెడలో 'టై' సరిచేసుకుంటూ అంటున్నాడు సూరి.

"......................."

"ఆ పని పూర్తికావాలంటే పదిహేను రోజులు సెలవు పెట్టాలి. నిత్యకర్మ చేయాలి. ఫ్యామిలీతో పోయి ఆ చిన్న ఊరిలో ఉండాలి. అంతా ఖర్చు... ఖర్చు... ఖర్చు..! పోనీలే అనుకున్నా- ఇంతకాలం దమ్మిడీ వెనకవేయని మనిషి ఎంత అప్పు చేశాడో తెలీదు. పూనుకొని ముందుకు దూకితే అన్నీ తలకు చుట్టుకుంటాయి."

'మొగుడు తనకు అమాయకుడిగా అన్పించినా- ఫరవాలేదే!' అనిపిస్తోంది సులోచనకు.

"చివరి రెండురోజులకు వెళితే సరి! ఈలోగా మరిది వచ్చి చూసుకుంటాడు!"

సూరికి సులోచన చెప్పింది బాగానే అన్పించింది. లేటుగా వెళితే కార్యక్రమం మొదలవుతుంది. కాబట్టి అన్నీ తమ్ముడే చూసుకుంటాడు. దెన్ హి డిసైడెడ్ టు ఎవాయిడ్! తమ ఇంట్లో ఏమీ జరగనట్లుగానే కులాసాగా ఆఫీసుకు వెళ్లిపోయాడు.

మావగారు పోయిన సంగతి రమణిని ఒకింత ఆశ్చర్యానికి గురిచేసినా- వెంటనే తేరుకొంది.

'అమరావతి ఎక్స్‌ప్రెస్ మార్కాపురం స్టేషన్‌కి రావడానికి ఇంకా గంటటైమ్ ఉంది. భర్తకు ఫోన్ చేస్తే... తను ఆఫీసుకి సెలవుపెట్టి వచ్చేస్తే... వెంటనే బయలుదేరితే ట్రైన్ దొరకడం పెద్ద కష్టమేమీ కాదు.

కానీ, ఓ గంట తర్వాత ఫోన్ చేస్తే పోలా..! ముసలాడు పోయిన రోజునే పోవాలా?! అంత ఎగేసుకుంటూ పోవడానికి తమకు ఏమాత్రం ప్రోగుచేసి ఇచ్చాడు కనుక?! కన్నాడు కాబట్టి కొడుకుల్ని చదివించాడు. తర్వాత ఉద్యోగం వేయించి అల్లుణ్ణి చేసుకున్నది తన తండ్రి. ఇక ఆయన గొప్పేముంది? తండ్రి పోయిన విషయాన్ని వెంటనే చెప్పకపోతే సోము గోల చేస్తాడేమో..?! తనకు తెల్సింది కూడా అప్పుడే!!'

– రమణి మనసులోని ఊహలు ముఖంలో కనిపిస్తున్నాయి. ఇంతకాలం ఆ ముసలాళ్ళిద్దరూ ఎక్కడో మారుమూల ఊరులో పడివున్నారు. ఇప్పుడాయన పోయాడు. ఇక, అత్తగారి ఆలన తలచుకొనేసరికి ఒళ్ళు జలదరించింది. ఈ సంతనంతా ఎవడు నెత్తినెక్కించుకుంటాడు? అందుకే సాధ్యమైనంత త్వరలో అమ్మానాన్నల్ని వచ్చి ఇక్కడకు చేరమంటే సరి! వాళ్ళిక్కడ ఉంటే ఇక ఆవిడకు పెద్దకొడుకే దిక్కు అవుతాడు.

సోము ఆఫీసు నుండి వచ్చేసరికి అమరావతి ఎక్స్‌ప్రెస్ వెళ్లిపోయింది. నాన్న పోయాడన్న విషయం పెద్దగా బాధపెట్టలేదు సోముని. జీవం కోల్పోయిన ఓ నిస్సత్తువ లాంటి నిట్టూర్పు వెలువడిందంతే! దానిలో పెద్దగా గాఢత ఏమీ కన్పించడం లేదు. ప్రాక్టికల్‌గా ఆలోచించి డబ్బే జీవన వేదమన్న సిద్ధాంతంతో మానసికంగా నాన్నకు దూరమై చాలాకాలమే అయింది.

రమణి, ఉద్యోగం వేయించి తన ఆర్థిక స్థిరత్వానికి బాట నేర్పరచిన అత్తింటివాళ్ళు, కన్న సంతానం... ఇవే ఇప్పుడు సోముకి ప్రాధాన్యతలు. ఒక్కమాటలో చెప్పాలంటే... వాళ్ళే తన సర్వస్వం కూడా! అందుకే కన్నవాళ్ళు... వాళ్ళ బాగోగులు... కొడుకుగా తన బాధ్యత... అనేవి చాలా ట్రాష్‌గా ఫీలవుతుంటాడు. మానవ సంబంధాల్ని శాసిస్తున్న ఆర్థిక సంబంధాలకు తనేమీ అతీతుడు కాదనుకుంటాడు. అన్నగారి కన్నా ముందు వెళితే అంతా తనమీద పడుతుంది.

గోపాలం చనిపోయి అప్పుడే ఇరవైనాలుగు గంటలు దాటింది!

ముఖంలోని ఛాయ క్రమంగా మారిపోతోంది... కళ్ళు లోపలికి పీక్కుపోతున్నాయి... శరీరం అదోలా అయిపోతోంది.

ఎవరు ఎంతగా ఓదారుస్తున్నా దుఃఖం ఆగడం లేదు మహాలక్ష్మికి. రాత్రంతా కంటిమీద కునుకు లేదు.

"లక్ష్మమ్మా! కొంచెం ఈ వేడికాఫీ త్రాగి గొంతు తడిచేసుకో!" మావుళ్ళయ్య మాటతో అటు తిరిగింది. రాత్రంతా తనతోబాటుగా అలాగే కూర్చున్నాడు. సూరి, సోము ఇంకా రాకపోవడంతో మావుళ్ళయ్యకు ఆందోళన ఎక్కువవుతోంది. వస్తూనే ఫోన్ల మీద ఫోన్లు చేస్తూనేవున్నాడు.

"వాళ్ళు బయలుదేరారంటావా..?!"

"బయలుదేరే ఉంటారమ్మా! అయినా దూరాభారం... సెలవు దొరకాలిగా!!" ఏదో ఆమెను సముదాయించాలని మాటవరస కన్నాడేగాని- వాళ్ళ వరస మావుళ్ళయ్యకు తెలియనిదేమీ కాదు!

"వాళ్ళు కొడుకులు కాదురా! కన్నవాళ్ళ గుండెల్ని కనికరం లేకుండా తూట్లు పొడిచే కసాయివాళ్ళు!" గోపాలం మాటలు గుర్తుకువచ్చాయి.

మావుళ్ళయ్యకు తెలుసు... వాళ్ళు ఇప్పుడు రారనీ.., ఎప్పుడో వస్తారనీ! మనసులోని ఉద్దేశాన్ని మహాలక్ష్మమ్మతో చెప్పడానికి సంశయిస్తున్నాడు.

"శవం కదిలితేనే ఊరిలో నిప్పు రాజేసేది! అంతవరకు పస్తులే!" పెద్ద మోతుబరి పెళ్ళాం చిన్నగా రాగాలు తీస్తోంది. అవును... రానివాళ్ళ కోసం ఎంతసేపు ఎదురుచూడటం?!

"లక్ష్మమ్మా! ప్రొద్దు క్రుంగిపోతోంది. వస్తే వాళ్ళు మధ్యలో కలుస్తారు... ఏర్పాట్లు కానిస్తాను."

మావుళ్ళయ్య మాటల్లోని ఆంతర్యాన్ని గ్రహించకపోలేదు ఆమె.

ఒక నిముషం మౌనం! ఊరు పొయ్యి రాజేసుకోవాలిగా... తప్పదుగా... కన్నకొడుకులు తండ్రికి కొరివి పెట్టడానికి కానరాకపోతే..??! ఆమెకి అంతర్యం అర్థంకావటం లేదు.

"గోపాలానికి ఏమీ కాకపోయినా నేనూ బంధువునే! వాడితోటి ఎన్నో సంవత్సరాల స్నేహం నాది! త్రెంచుకొనే బంధాలకు అతీతమైన అనుబంధం మాది! వాడు నా చేతుల్లో కాలిపోవాలని రాసిపెట్టివుంటే నాకు అంతకన్నా కావాల్సింది లేదు!" మావుళ్ళయ్య మాటలు కొండంత బలాన్నిస్తున్నాయి ఆమెకు.

కానీ, కొడుకులు తమ బాధ్యతల్ని విస్మరించినపుడు- 'తలకొరివి పెట్టడానికి నేనున్నా'నంటూ ముందుకొచ్చిన భర్త స్నేహితుడు! ఆనందంతో ఆమె హృదయం పులకించింది.

కానీ, 'తన భర్త... ఇన్నాళ్లూ తనకు తోడుగా, కష్టసుఖాల్ని సమానంగా కాకుండా సుఖాల్ని తనకిచ్చి, కష్టాల్ని మాత్రం పూర్తిగా తనే భరించిన భర్తకి- ఆ పని కాస్తా తానే ఎందుకు పూర్తి చేయకూడదు?

తను ఆడది..! శాస్త్ర విరుద్ధమనీ, కుదరదనీ సంఘం శాసిస్తే... వెక్కిరిస్తే..?! బ్రతికుండగా కన్నవాళ్ళకు నరకాన్ని చూపించినవాళ్ళు చచ్చినతర్వాత పున్నామ నరకం నుండి తప్పిస్తారా..? అసలు తానే ఎందుకు ఆ నరకాన్ని తప్పించకూడదు?'

మొదటిసారిగా మహాలక్ష్మిలో ఆత్మశోధన! మావుళ్ళయ్య మంచిమనసు హర్షించదగ్గదే! కానీ, అయినవాళ్ళు లేని అనాథలా... అందరూ ఉండీ, ఎవ్వరూ లేనట్లుగా..!?

ఆమె నోట ఆ మాటలు విని, అక్కడున్న కొద్దిమందీ అవాక్కయ్యారు.

"కాదమ్మా! నీవు ఆడదానవు... నీకెందుకు చెప్పు? నేనున్నాగా! రేపోమాపో వాళ్ళు వస్తారు... ఉత్తరక్రియలు పూర్తిచేస్తారు!"

"ఉత్తరక్రియలు వాళ్ళు నిర్వహించినప్పుడు- నిండుహృదయంతో నా మొగుడికి నేనే తలకొరివి పెట్టి..." ఇంకా ఏదో చెప్పబోతోంది కానీ, వేదన మాటున ఆ మాటలు విన్పించడంలేదు.

ఆ క్షణాన ఆమెను వారించడానికి ఎవ్వరూ సాహసం చేయలేకపోయారు.

"గోపాలం మాష్టారు ఊరందరికీ కావాల్సిన మంచిమనిషి... ఆయనకు తగిన భార్య మహాలక్ష్మి. ఆవిడ మాట ప్రకారమే కానీయండి!" ఊరిపెద్ద మాటతో ఏర్పాట్లు చకచకా సాగిపోయాయి. మహాలక్ష్మి తలకొరివి పెట్టగా గోపాలం పార్థివ శరీరం అనంతవాయువుల్లో కలిసిపోయింది. అంతటి వేదనలోనూ ఓ ఆత్మసంతృప్తిని మిగుల్చుకొంది ఆమె.

•

గోపాలం చనిపోయి వారం అవుతోంది...

అప్పుడు ఊడిపడ్డారు ఇద్దరు కొడుకులు, కోడళ్ళు, వాళ్ళ పిల్లలు!

వెంటనే రాకపోవడానికి వారి వారి కారణాలు వినసొంపుగానే ఏకరువు పెడుతున్నారు.

'తండ్రికి సొంత ఇల్లు లేదు, పెద్దగా ఆదాయం లేదు, ఖర్చు తప్ప వీరివల్ల ఐదుపైసల ప్రయోజనం లేదు...' కొడుకులూ, కోడళ్ళ ఉద్దేశాన్ని మహాలక్ష్మి బాగానే గమనిస్తోంది. ఆ మాటలకి ఆమె మౌనమే సమాధానమవుతోంది.

వాళ్ళు వచ్చిన మర్నాడే మావుళ్ళయ్య తెచ్చిన వార్త- మహాలక్ష్మితో సహా అందర్నీ ఆశ్చర్యంతో ముంచెత్తుతోంది. ఓ విధంగా భర్తపోయాక- అంతటి బెంగలోనూ భవిష్యత్ పట్ల తీవ్ర అంధకారం అలుముకుంది ఆమెలో.

ఇన్నాళ్లూ గుట్టుచప్పుడు కాకుండా సంసారాన్ని ఎలాగో నెట్టుకొచ్చారు. ఇప్పుడు రోడ్డున పడే పరిస్థితి! కనీసం ఉండడానికి సొంతకొంప కూడా లేదు. ఇప్పుడు కొడుకుల చెంతకు చేరడం అనివార్యంగా కనిపిస్తోంది. రాబోయే విషమస్థితిని తలచుకుంటే మహాలక్ష్మి కంపించి పోతోంది. 'పోనీ, వాళ్ళ పంచకు చేరడమా?' అంటే... అసలు వాళ్ళు తమతో రమ్మని పిలవాలి కదా?! ఇలాంటి మానసిక సంఘర్షణలో మావుళ్ళయ్య మాట ఎంతో ఊరట నిచ్చింది.

"గోపాలం నా ప్రాణస్నేహితుడు. వాడూ, నేనూ ఒకటిగా పెరిగాం! మీకెవరికీ తెలియని వాడి గురించి నాకు ఎంతో తెలుసు. వాడి మనసు... ప్రేమాభిమానాలు..."

"......................"

"మహాలక్ష్మి గురించి నీకు తెలుసు. ఎప్పుడూ తనకు ఇది కావాలని అడగలేని పిచ్చిది. ఆనాడు నన్ను ప్రేమించి, నా పేదరికాన్ని మన్నించి, అయినవాళ్ళనందర్నీ వదులుకొని నాతో జీవితాన్ని పంచుకోవడానికి వచ్చింది. రేపు నా తర్వాత... ఆమె అన్నివిధాలా ఒంటరిదైనపుడు... దాని గురించి తలచుకుంటేనే భయంగా ఉంది నాకు. కనీసం ఉండడానికి గూడును అమర్చి పెట్టాలన్న ఉద్దేశంతో మా ఇంటి ఆయన తాను కొడుకుల దగ్గరకు వెళ్లిపోతున్నపుడు ఇంటిని బేరం పెడితే మూడో కంటికి తెలియకుండా రెండు లక్షలు యిచ్చి వ్రాయించుకున్నాను.

అలాగే నాకంటూ ఆదాయం ఏదైనా ఉందంటే... ఎన్నాళ్లనుంచో ఎవరికీ తెలియకుండా ఆమెకోసం చేసిన ఐదులక్షల ఎల్.ఐ.సి. పాలసీ, వాటి తాలూకు కాగితాలు! సమయం వచ్చినపుడు మహాలక్ష్మికి అందించాల్సిన బాధ్యత నీదీ.

పిచ్చిది... ముందుగా ఆమె చేతిలో పెడితే కొడుకుల మీద వెఱ్ఱిప్రేమ కావచ్చు- తల్లి పచ్చగా ఉంటే దోచుకుపోవాలనే వాళ్ళ కపట అభిమానం కావచ్చు- కథ మళ్లీ మొదటికొస్తుంది!"

– అని చెప్పి, మావుళ్ళయ్య ఇచ్చిన ఇంటితాలూకు దస్తావేజులు, బీమా పాలసీలు చూసిన తర్వాత వాళ్ళలో విపరీతమైన మార్పు కనిపిస్తోంది.

చెప్పాలంటే... ఆనాడు మహాలక్ష్మి తన జీవితంలో ప్రవేశించిన తరువాత తనకున్న పరిధిలో గోపాలం ఆమెను కాలు క్రిందపెట్టనివ్వలేదు.

చిన్నతనం నుంచే స్వేచ్ఛను కోరే పిల్లలు... తండ్రిగా తను గట్టిగా శాసించినా లెక్కచేయక ఎదురుతిరిగి మాట్లాడే పిల్లలు... వాళ్ళను పెద్దగా నియంత్రించలేని మెతకతనం... అమ్మను సైతం 'ఇది కావాలి, అది కావాలి' అంటూ సతాయించి వేదనకు గురిచేసిన సంఘటనలు... అవన్నీ కలగలిపి వాళ్ళ కొద్ది వయస్సులోనే గోపాలం ఒక రహస్యాన్ని కనుగొన్నాడు. తనకు జన్మించిన ఇద్దరు పిల్లలు 'స్వార్థపరులు!' తను పోయిన తరువాత సూరి, సోము తల్లిని సరిగా చూడరని తెలుసు. గోపాలం ఊహించిందే జరుగుతోందీనాడు!

మొత్తానికి కర్మకాండ అంతా కొడుకుల చేతుల మీదుగా మొక్కుబడిగా సాగిపోయింది.

ఈ నాలుగు రోజులలో మావుళ్ళయ్య బయటపెట్టిన విషయం... ఏమీ లేదనుకున్న తండ్రి- తమ తల్లికి కొంత ఆధారం చూపిన వైనం, ఇల్లును కూడా కొనిచ్చిన సంగతి... ఆ కొడుకుల్ని క్రమంగా తల్లికి దగ్గరగా చేస్తున్నాయి.

"నువ్వు ఒక్కదానివే ఎందుకమ్మా ఇక్కడ? నీకా... ఆరోగ్యం అంతంత మాత్రం! నాన్నలేని నువ్వు ఈ పల్లెటూరిలో ఎలా ఉండలవ్? ఈ సమయంలో మాతోడు అవసరం నీకు!"

ఒకరిని మించిన మరొకరి పోడిపోడి ప్రేమల్ని గ్రహిస్తూనే ఉంది మహాలక్ష్మి.

ఇక కోడళ్ళ సంగతయితే సరేసరి... అడుగులకు మడుగులొత్తుతున్నారు.

"మా అమ్మానాన్న లుంటారని సంశయం వద్దు అత్తయ్యా! మాకు మీరే ముఖ్యం!" చిన్నకోడలు రమణి మాటలు ఒకవైపు నవ్వును తెప్పిస్తున్నాయి.

అంతా యాంత్రికంగా, కల్పనగా, అసహజంగా తోస్తోంది.

పెద్దకోడలు సులోచనయితే సరేసరి- "మీరు నా పిల్లలతో సమానం అత్తయ్యా! ఈ విషాద సమయంలో మీరు ఒక్కరే ఎలా ఉండగలరు చెప్పండి? మేము లేమనుకున్నారా?" అంటూ వెంటపడి మరీ పోరుతోంది. మనవల చేత అడిగిస్తోంది.

భర్త వారిస్తున్నా ఇన్నాళ్లూ కొడుకుల మీద పెంచుకున్న మమకారం హరించుకుపోతోంది. తండ్రి అప్పులు చేసివుంటాడనీ... అవన్నీ తమ తలలకు చుట్టుకుంటాయనీ... ఇల్లు, డబ్బు లేదనీ... ఖర్చు తప్ప దమ్మిడీ ఆదాయం లేదనీ... ఇన్నాళ్లూ కంటిచూపు, నోటిమాట లేకుండా ఉన్న వాళ్ళని చూస్తుంటే- 'వాళ్ళు ఎప్పుడు పోతారా...' అనిపిస్తోంది మహాలక్ష్మికి. ఆ మాటలు అసహ్యాన్ని మిగులుస్తున్నాయి.

"ఎన్నిసార్లు చెప్పించుకుంటావ్? అయినా, నీకు ఇక్కడ ఎవరున్నారని?" వెళ్లడానికి ఉపక్రమిస్తూ నిలేశాడు సూరి.

'ఈ ఇల్లు ఆయన కష్టార్జితం! తన జ్ఞాపక చిహ్నం! ముందే ఇచ్చేస్తే పిల్లలకి ధారాదత్తం చేస్తానని విషయం దాచిపెట్టారు!' అది చాలా మంచిపనిగా అన్పిస్తోంది మహాలక్ష్మికి.

"నీకా... వయసు మీరుతోంది! ఈ చిన్న ఇల్లు అమ్ముకొని వచ్చేస్తే నా దగ్గర నీకు ఏ లోటూ ఉండదు..." సోము సూట్‌కేస్ సర్దుకుంటూ అంటున్నాడు.

ఎవరేమన్నా వాళ్ళందరికీ మహాలక్ష్మి మౌనభాషే సమాధానమయింది. ఇన్నాళ్లూ ఎంత దుర్మార్గంగా ప్రవర్తించినా కన్నతల్లి– అందునా పూర్వకాలం మనిషి కాబట్టి– కరిగిపోయి ఎప్పటికైనా తమ దగ్గరకొస్తుందని ముందుకు కదిలిపోయారు వాళ్ళు.

భర్తకు దూరమైనా మహాలక్ష్మికి తాను ఒంటరి అన్పించడం లేదు. తనకోసం కొంత ఆధారం, కొన్ని ఏర్పాట్లు..! ఇల్లంతా చూసుకొంది. ఎన్నో ఏళ్లుగా ఈ ఇంట్లోనే తిరిగిన భర్త జ్ఞాపకాలు కొండంత అండగా నిలిచి అదనపు బలాన్నిస్తున్నాయి.

ఆనాటి ఆ పత్రికలోని ప్రకటన ఆమెను ఆలోచనలో పడేసింది...

పడగెత్తిన కడలి, విరుచుకుపడ్డ రాకాసి కెరటాలు... పల్లె బ్రతుకుల్లో ప్రళయం సృష్టించాయి. కన్నుమూసి తెరిచేలోపే అనేక జీవితాలు బలైపోయాయి.

కడలి అలలు నిశ్శబ్దంగా పడగెత్తినప్పుడు పల్లెబ్రతుకులు ఛిద్రమైపోయాయి. సాగరగర్భంలో భూకంపం శోకసముద్రాన్ని సృష్టిస్తోందంటూ... సునామీ గురించి హృద్యంగా ఉంది.

ఆ దుర్ఘటనలో తల్లిదండ్రుల్ని, అందర్నీ కోల్పోయిన ఓ మూడేళ్ల ఆడపిల్లను ఆదుకొనేందుకు దాతలుంటే ముందుకు రమ్మని కోరుతున్నారు. దత్తత నీయడానికైనా సంసిద్ధతను తెలియజేస్తున్నారు.

ఆ పిల్ల ఫోటో చక్కగా ఉంది. ముఖంలో అమాయకత్వం తొణికిసలాడుతోంది. మంచితనం పలచబడి స్వార్థం బలపడుతూన్నా నిజం మారు ఆలోచనకు ప్రేరణ అవుతోంది. మనుషులు మరయంత్రాల్లా కాకుండా మానవత్వమున్న మహనీయుల్లా మెలగక జీవన పరుగుపందెంలో యంత్రాలైపోతున్నారు. మానవ సంబంధాలు విచ్ఛిన్నమైపోతున్న నేటికాలంలో 'గౌరవప్రదంగా డబ్బు సంపాదన' నిన్నటి సూత్రానికి ప్రతీకగా, 'డబ్బుంటేనే గౌరవం' అని తిరగవ్రాయబడుతోంది.

సమాజం ఎలా ఉండకూడదో అలా ఉన్న సమాజం... అమానవీయత... నిర్దయ... విచ్చుకత్తుల్లా కదిలే మనుషులు... హృదయాలతోగాక మెదళ్ళతో మానవత్వాన్ని బేరీజు వేసి ఆత్మీయతల్ని కూడా వాణిజ్య వస్తువులుగా చేస్తూన్న దయనీయమైన పరిస్థితి మహాలక్ష్మిని అతలాకుతలం చేస్తున్నాయి.

మరోసారి ఆ పసిదాని ఫోటోను చూసుకొంది... పసితనంలోని పరవశమంతా తానయి ఉంది. ఇన్నాళ్ల తన సమస్యకు పరిష్కారం దొరికినట్లనిపించిందామెకు.

'ఇంతకు పూర్వం ప్రేమనూ, అనురాగాన్నీ పంచి– పిల్లల్ని పెంచి పెద్దచేసినా ఏమీ మిగలలేదు మాకు. అందుకే మానవత్వాన్ని రంగరించి మరో జీవిని పెంచుదామనుకుంటున్నాను' అన్న విషయం సోముకూ, సూరికీ తెలియజేయాలని పెన్నూ, కాగితం బయటకు తీసింది.

'విశాలాంధ్ర' దినపత్రిక (ఆదివారం అనుబంధం) ... *25 డిసెంబర్' 2005*